క్లుప్తంగా

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం: ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు ఐసిడిఎస్ సీడీపీఓ ఉష తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఆయా పోస్టుకు సంబంధించి ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. సామర్లకోట మండలం మేడపాడు గ్రామం (ఓసీ) కేటగిరి అభ్యర్థి ఈ పోస్టుకు అర్హులన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులై, 35 ఏళ్ల లోపు వయసు గలవారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

కార్యదర్శులకు ముగిసిన శిక్షణ

సామర్లకోట: స్థానిక టీటీడీసీలో సచివాలయ కార్యదర్శులకు నిర్వహిస్తున్న రెండో బ్యాచ్ శిక్షణ ఆదివారంతో ముగిసింది. కంప్యూటర్, సోషల్ మీడియా సర్వీసు మేటర్లు, సచివాలయాల్లో విధుల నిర్వాహణపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శులు, ఆయా మున్సిపాలిటీల నోడల్ అధికారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు 'పాలచర్ల' మృతి



సాయిబాబు భౌతికకాయం వద్ద నివాళులు అర్పించిన దొరబాబు తదితరులు

సామర్లకోట: సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు, వేట్లపాలెం పార్టీ కన్వీనర్ పాలచర్ల సాయిబాబు ఆదివారం మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు వేట్లపాలెంలోని ఆయన స్వగృహానికి చేరుకున్నారు. ఆయన భౌతిక కాయానికి ఘనంగా నివాళులు అర్పించారు. సాయిబాబు మృతి పార్టీకి తీరని లోటని, ఆయన మృతిని జీర్ణించుకోలేక పోతున్నామని దొరబాబు సంతాపం తెలిపారు. సాయిబాబు కుటుంబ సభ్యులను ఓదార్చి, దొరబాబు సానుభూతి తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా జాతీయ జెండాల విక్రయం



జాతీయ జెండాలను విక్రయిస్తున్న తపాలా సిబ్బంది

సామర్లకోట: ప్రతి ఇంటిపై జాతీయ జెండాలు ఉండే విధంగా ప్రజలను చైతన్యం చేయాలనే పిలుపులో భాగంగా స్థానిక హెడ్ పోస్టాఫీసు సిబ్బంది జెండాల విక్రయాలపై ప్రజలను అవగాహన పెంచుతున్నారు. దీనిలో భాగంగా ఆదివారం పట్టణంలో ముఖ్య కూడళ్లలో మైక్ ద్వారా జాతీయ జెండా రూ.25 మాత్రమే అంటూ ప్రజలకు వివరిస్తున్నారు. పోస్టుమన్‌లు పట్టణంలో మోటారు సైకిళ్లపై పర్యటించి జాతీయ జెండాలను విక్రయిస్తున్నారు.

40 మంది రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

పెద్దాపురం: స్థానిక వీర్రాజు హైస్కూల్ 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తమ చిన్ననాటి మిత్రుల జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక సినిమా సెంటర్‌లో ఉన్న దేవాంగ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో 40 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో పెదిరెడ్డి నరేష్, చింతా శ్రీను, నెక్కల భుజంగరావులతో పాటు పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో సెల్‌ఫోన్ చోరీ

తుని రూరల్: మండలంలోని తేటగుంట శివారు ఎర్రకోనేరు వద్ద ఆదివారం సినీఫక్కీలో సెల్‌ఫోన్ చోరీ చేశారు. వివరాల్లోకి వెళితే....రౌతులపూడి మండలం బీబీ పట్నం గ్రామానికి చెందిన నల్లిమిల్లి యర్రాపాత్రుడు మోటార్ సైకిల్‌పై తుని వస్తున్నాడు. ఎర్రకోనేరు వద్దకు చేరుకున్న అతని ముందు మరో బైక్‌పై ఇద్దరు ప్రయాణిస్తూ అదుపుతప్పి కిందపడినట్టు నటించారు. దీంతో యర్రాపాత్రుడు వారికి సాయం అందించేందుకు వెళ్లగా అతని జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను వారు కాజేసి బైక్‌పై తునివైపు వెళ్లిపోయారు. దీనిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బాధితుడు తెలిపారు. గత నెలలో డబ్బు కోసం హోటల్‌లో మహిళలను ఇద్దరు హంతుకులు ఈ ప్రాంతంలోనే హత్య చేశారు. వరుస సంఘటనలతో ఆ ప్రాంత వాసులు ఆందోళనకు గురవుతున్నారు.


వరాలమ్మ వ్రతాలకు సన్నద్ధం

- 18 నుంచి సామూహిక వ్రతాలు
- పూజా సామగ్రి సమకూర్చనున్న దాతలు
- దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం

సామర్లకోట: ఏడాదికో మాసం.. ఆ మాసంలో నాలుగు వారాలు.. మహిళలు మంగళకరంగా తయారై అమ్మవారి స్వరూపాలుగా అలంకరించుకుని ఇంటికో వరలక్ష్మి నడయాడే రోజు. అదే శ్రావణ శుక్రవారం. మహాలక్ష్మికి ప్రీతిపాత్రమైనది.. ఐదో తనాన్ని నిలబెట్టుకునే వరాన్నివ్వమని అమ్మవారిని ప్రతి హిందూ స్త్రీ మనసా వాచా కర్మేణ వరలక్ష్మీ దేవి వ్రతమాచరించే రోజిది. అనుకోని అవాంతరాలు ఏర్పడి కొన్ని ఇళ్లలో ఈ వ్రతం ఆచరించడానికి కొన్నిసార్లు కుదరదు. ఇటువంటి వారికోసం పలు ప్రముఖ ఆలయాల్లో ఈ వ్రతాలను సామూహికంగా నిర్వహించడం పరిపాటి. ఇందులో భాగంగా స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీ బాలత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారాల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించడానికి నిర్ణయించారు. ఈ నెల 18, 25, సెప్టెంబరు 1, సెప్టెంబరు 8వ తేదీల్లో వచ్చే శుక్రవారాల్లో సామూహిక వ్రతాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

దాతల సహకారంతో సామగ్రి..

వరలక్ష్మి వ్రతాలకు కావలసిన పూజా సామగ్రిని ఏటా దాతలు సమకూరుస్తుంటారు. ఈ ఏడాదీ దాతల నుంచే సమకూర్చడానికి ట్రస్ట్ బోర్డు ఇటీవల సమావేశంలో నిర్ణయించింది. వ్రతాలకు వచ్చే మహిళలు కొబ్బరికాయ, కేజీన్నర బియ్యం, కలశ పాత్ర, జాకెట్టుగుడ్డ మాత్రమే తీసుకు రావలసి ఉంటుంది.



సామర్లకోటలోని శ్రీబాలత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం

కోనేటి పనుల్లో జాప్యం

ఆలయ కోనేటి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గ్రావెల్ వేసి వదలి వేశారు. దానిపై ఇసుక వేయావలసి ఉంది. దీనిపై పురావస్తుశాఖ అధికారులను వివరణ కొరగా మరో 15 రోజుల్లో ఇసుక పనులు పూర్తి చేస్తామని చెప్పారు. దాంతో మొదటి శుక్రవారం నాటికి పనులు పూర్తి అయ్యే అవకాశం లేదు.



అసంపూర్తిగా ఉన్న పంచారామ క్షేత్ర కోనేరు

పేర్లు నమోదు చేసుకోవాలి



సామూహిక వ్రతాలకు వచ్చే భక్తులు ముందుగా తమ పేర్లను ఆలయంలో నమోదు చేయించుకోవాలి. ప్రతి శుక్రవారం 9.15 నిమిషాలకు సామూహిక వ్రతాలు ప్రారంభమవుతాయి. మహిళలు సకాలంలో హాజరు కావాలని తీర్మానించాం. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేస్తాం.

– మట్టపల్లి రమేష్‌బాబు, ట్రస్టు బోర్డు చైర్మన్, సామర్లకోట

అర్చకుల ఏర్పాటు..



పంచారామ క్షేత్రంలో సామూహిక వ్రతాలు నిర్వహించే పురోహితులకు దేవస్థానం నుంచి రుసుం చెల్లిస్తాం. వ్రతాలు చేయించుకునే భక్తులను సంప్రదాయబద్ధంగా చీరలు ధరించి రావాలి. భక్తుల సంఖ్యను బట్టి మొదటి అంతస్తుతో పాటు కింద ప్రాకారంలోను సామూహిక వ్రతాలకు పురోహితుల మంత్రాలు వినిపించేలా ఏర్పాట్లు చేస్తాం.

– డి.నాగమల్లేశ్వరరావు, పంచారామ క్షేత్ర ఈఓ, సామర్లకోట

ట్రిపుల్ ఐటీకి రోషన్‌బాబు



ప్రదీప్ రోషన్‌బాబు

సామర్లకోట: ట్రిపుల్ ఐటీ రెండో విడతలో స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆదివారం రాత్రి పాఠశాల హెచ్‌ఎం యు.సత్యనారాయణ స్థానిక విలేకర్లకు వివరాలు తెలిపారు. ఎం.ప్రదీప్ రోషన్‌బాబుకు శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీకి సీటు వచ్చిందన్నారు. దాంతో తమ పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తీర్ణులైన ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయని తెలిపారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన రామలింగేశ్వరస్వామికి ఆదివారం అష్టోత్తర నారికేళ జలాభిషేకం చేసినట్టు ఆలయ అర్చకుడు వీరబాబు దత్తులు తెలిపారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామివారికి మహన్యాస పారాయణం చేసి పంచామృతాభిషేకం, శత నారికేళ అర్చన నిర్వహించామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రతి ఇంటా మొక్కలు నాటాలి

- హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు

సామర్లకోట: నా భూమి–నా దేశం పేరున నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ఆదివారం వేట్లపాలెంలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత ఏడాది ప్రారంభమైన ఆజాదీ కా అమృత్ మహోత్సవలో భాగంగా ప్రతి ఏటా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో ప్రతి ఇంటి వద్ద రెండు మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఈ సందర్భంగా వేట్లపాలెం పీహెచ్‌సీని పరిశీలించి అంబేడ్కర్, మహాత్మ గాంధీ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అమర వీరుల పేరున ఏర్పాటు చేసిన శిలఫలకాన్ని ఆయన ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఉపాధి ఏపీఎం ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి మోసే, హుస్సేన్‌పురం ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గొలి బాబ్జీ, ఆస్పత్రి సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



వేట్లపాలెం పీహెచ్‌సీ ఆవరణలో మొక్క నాటిన దవులూరి దొరబాబు, ఎంపీపీ తదితరులు

పారిశుధ్య సమస్యను పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో ఈ–ఆటోలు ప్రారంభం

పిఠాపురం: పారిశుధ్య సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురం మున్సిపాలిటీలో ఎనిమిది ఈ–ఆటోలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మీడియాతో మాట్లాడారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు, ఐదేళ్ల ఎమ్మెల్యేగా చేసిన వర్మ ఏఒక్క రోజు నిజాలు మాట్లాడడం లేదని విమర్శించారు. ఎంతో మెజారీతో నెగ్గిన మాజీ ఎమ్మెల్యే వర్మ ఈ రోజు పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. పిఠాపురంలో మురికి కాలువ పక్కనే కార్యాలయం పెట్టి అక్కడే ఐదేళ్ల పాటు పాలన చేసిన ఆయనకు దుర్వాసన రాలేదని, ఇప్పుడు మాత్రం కాలువలు కంపు కొడుతున్నాయని మురికి రాజకీయం చేస్తున్నారని వర్మపై మండి పడ్డారు. పిఠాపురం పట్టణంలో పంట కాలువలు, మురుగు కాలువలు కలిసే ఉండడంతో మురుగు నీరు సమస్య గత 40 ఏళ్లకు పైబడి ఉందన్నారు. నిజంగా పట్టణ ప్రజలపై ప్రేమ చూపించే వ్యక్తే అయితే తన పాలనలో పారిశుధ్య సమస్యకు ఎందుకు పరిష్కారం చూపించలేక పోయారో వర్మ చెప్పాలన్నారు. పట్టణంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం వ్యర్థాలు కొట్టుకు రావడంతో పారిశుధ్య సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. కాలువలపై గతంలో నిర్మించిన వంతెనలు ఇరుగ్గా ఉండడం, అక్కడ వ్యర్తాలు నిలిచిపోయి నీరు ముందుకు పారడం లేదన్నారు. పారిశుధ్య సమస్యకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టడానికి ఇప్పటికే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించామన్నారు. ఇవేమి పట్టించుకోని వర్మ రాద్ధాంతం చేయడం అతని కుటిల రాజకీయాలకు నిదర్శనమన్నారు. తాను చేయలేక పోగా ఇప్పుడు మేము చేస్తుంటే చూసి ఓర్వలేక తప్పుడు విమర్శలు చేస్తుంటే వర్మను ప్రజలు చీదరించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, గండేపల్లి బాబీ, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ నేత బొజ్జా రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో ఈ–ఆటోలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

తీరంలో పర్యాటకుల సందడి



కడలి కెరటాల్లో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

కొత్తపల్లి: ఉప్పాడ సాగర తీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. కడలి కెరటాల్లో పిల్లలు, పెద్దలు కేరింతలు కొట్టారు. కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. పర్యాటకుల ఆటపాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. ఉదయం లోవలోని తలుపులమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం సాగర తీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ తీరం

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రారంభం

పిఠాపురం: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం పట్టణం 15వ సచివాలయం మంగయ్యమ్మరావుపేటలో రూ.1.20 కోట్లతో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్ర చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక డాక్టర్‌గా పేద ప్రజలకు వైద్య సేవలు అందించడానికి ప్రత్యేక పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 108, ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అదించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం ఆయన వారసుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలకు వైద్య సేవలు అందించడానికి విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. రూ.వేల ఖరీదైన అన్ని రకాల వైద్య పరీక్షలు ప్రభుత్వాసుపత్రులలో ఉచితంగా చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. గతంలో చిన్న వైద్యానికి సైతం ఇతర ప్రాంతాలు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ప్రతి గ్రామంలోనూ వైద్యశాలలు నిర్మించి అధునాతన వైద్య పరికరాలు ఏర్పాటు చేయడంతో అన్ని రకాల వైద్య సేవలు ప్రజల ముంగిటకే వచ్చాయన్నారు. ఇటువంటి అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని అన్నారు. ప్రతిపక్షాలు అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత గండేపల్లి బాబీ, పలువురు వైద్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పిఠాపురంలో ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

లారీ నుంచి జారి పడిన బండరాయి

- త్రుటిలో తప్పిన ప్రమాదం

కొత్తపల్లి: పిఠాపురం– ఉప్పాడ రోడ్డులో అధికలోడుతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్నారు. దీంతో వాహన చోదకులు, పాదచారులు భయాందోళనకు గురవుతన్నారు. అధిక లోడుతో పాలు మితిమీరిన వేగంగా వాహనాలను నడపడంతో రాళ్లు రోడ్డు మీద జారి పడుతున్నాయి. కొత్తపల్లి ఊరచేరువు సమీపంలో ఆదివారం వేగంగా వెళుతున్న లారీలో నుంచి ఒక్కసారిగా బండరాయి పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లోడు లారీల నుంచి తరచూ రాళ్లు కింద పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అధిక లోడు, మితిమీరిన వేగంతో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తపల్లి ఊర చెరువు సెంటర్ సమీపంలో లారీ నుంచి జారిపడిన బండరాయి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఆదివారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని కొండెవరం గ్రామానికి చెందిన తోలెం శ్రీరాములు (62) గత నెల 15న తన ఇంటి వద్ద నడుస్తూ కాలు జారిపడి పడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

శంఖవరం: డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ సూచించారు. మండలంలోని కొత్తూరులో ఆదివారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇళ్ల మధ్య నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

బాడీ ఫ్రీజర్ ఐస్ బాక్స్ ఏర్పాటు

పిఠాపురం: మనఊరు–మన బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో బాడీ ఫ్రీజర్ ఐస్ బాక్స్ ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ సభ్యులు తెలిపారు. ఆదివారం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతదేహాన్ని భద్రపరిచే ఐస్ బాక్సును ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ సభ్యులు మాట్లాడుతూ ఇప్పటికే అంతిమ యాత్ర వాహనాన్ని దాతల సహకారంతో ఏర్పాటు చేయగా పిఠాపురంతో పాటు ఇతర ప్రాంతాల వారికి ఉపయోగపడుతోందన్నారు. ఇప్పుడు తమ స్వచ్ఛంద సంస్థ కోరిన వెంటనే ఆకొండి వెంకటసత్యనారాయణ మూర్తి, రాజ్యలక్ష్మి, వారి కుమార్తె కృష్ణహాసిని, ఆకొండి కృష్ణమూర్తి, సూర్యాకాంతం, సూర్యప్రకాశరావు పేరున రూ.లక్షల విలువైన ఐస్ బాక్సును అందజేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కొండేపూడి శంకర రావు, అల్లవరపు నగేష్, కేవీవీఎస్ ప్రసాద్, మూర్తి సతీష్, ప్రసాదరెడ్డి శివ తదితరులు పాల్గొన్నారు.



బాడీ ఫ్రీజర్ ఐస్ బాక్స్‌ను స్వచ్ఛంద సంస్థ సభ్యులకు అందిస్తున్న దాతలు

చివరి మజిలీకీ తప్పని అవస్థలు

జగ్గంపేట: మండలంలోని రామవరం కొత్త ఎస్సీ కాలనీవాసులకు చివరి మజిలీకి కష్టాలు తప్పడం లేదు. రామవరం కొత్త ఎస్సీ కాలనీ నుంచి క్రిస్టియన్ శ్మశాన వాటికకు వెళ్లేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొత్త ఎస్సీ కాలనీకి చెందిన చింతపల్లి వెంకటలక్ష్మి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకు వెళ్లడానికి బంధువులు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్మశాన వాటికకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో నాట్లు వేసిన వరి పొలాల మధ్య నుంచి మృతదేహాన్ని తీసుకువెళ్లారు.

40 ఏళ్లుగా...

సుమారు 40 సంవత్సరాల క్రితం కాలనీ ఏర్పడిందని, అప్పటి నుంచి ఇప్పటివరకూ శ్మశాన వాటికకు మార్గం సమస్య పరిష్కారం కాలేదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జుత్తుక నాగేశ్వరరావు తెలిపారు. తమ కాలనీకి ఒకపక్క జాతీయ రహదారి, మరో పక్క గోనేడ వెళ్లే రహదారి ఉన్నాయని, పొలాల మధ్యలో నుంచి రోడ్డు ఏర్పాటు చేస్తే శ్మశానానికి త్వరగా వెళ్లవచ్చన్నారు. ఈ సమస్యను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై పంచాయతీ ఈఓ బి.రాగాలను వివరణ కోరగా శ్మశానానికి వెళ్లడానికి వేరే రహదారి ఉందన్నారు. కొత్త ఎస్సై కాలనీకి ఇది దూరం కావడంతో పొలాల మధ్య నుంచి రహదారి వేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారని చెప్పారు. రైతుల నుంచి భూసేకరణ పంచాయతీ నుంచి రోడ్డు వేస్తామని తెలిపారు.



రామవరంలో శ్మశాన వాటికకు పొలాల మధ్య నుంచి మృతదేహాన్ని తరలిస్తున్న కుటుంబ సభ్యులు

వాటర్ ట్యాంక్ శిథిలం

కొత్తపల్లి: స్థానిక ఊర చెరువు సెంటర్‌లో ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ట్యాంక్ కింద భాగంలో పెచ్చులు ఊడిపోతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ట్యాంక్‌లు శుభ్రపర్చేందుకు వీలులేకుండా మెట్లు, ట్యాంక్ పైకప్పు పూర్తిగా శిథిలమవడంతో తాగునీరు కలుషితమవుతోంది. ప్రతి నెలా ట్యాంక్‌లను పంచాయతీ సిబ్బంది శుభ్రం చేయాల్సి ఉండగా మెట్లు లేకపోవడంతో ట్యాంక్‌ను శుభ్రపర్చడం లేదు. ఈ ట్యాంక్ నిర్మించి సుమారు 45 సంవత్సరాలు పూర్తికావస్తున్నా దీని స్థానంలో కొత్త ట్యాంక్ నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నూతన ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్తపల్లిలో శిథిలమైన వాటర్ ట్యాంక్ →

